ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





నెలల తరబడి అందని వేతనాలు

- 104, 108 ఉద్యోగులకు మూణ్ణెల్లుగా పెండింగ్
- అప్పులుచేసి విధులకు హాజరు
- సిబ్బంది సంక్షేమంపై కొరవడిన పర్యవేక్షణ



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సామాజిక వైద్య సేవల్లో కీలక భూమిక పోషిస్తున్న 104, 108 వాహనాల సిబ్బందికి మూణ్ణెల్లుగా వేతనాలు రావడం లేదు. విధి నిర్వహణ కోసం వెళ్లడానికి ప్రయాణ ఖర్చులకు సైతం అప్పులు చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడుతూ తమ ప్రాణాలను పణంగా పెడుతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నామంటున్నారు.

104,108 వాహనాల్లో దాదాపు 500 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి 104, 108 సిబ్బందిగా పని చేస్తున్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పారామెడికల్ సిబ్బందికి జీతాలు చేతికి రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో 104 సిబ్బంది పది రోజులుగా శాంతియుత నిరసనలు చేపట్టారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. తమ పరిధిలోని వైద్యుల వద్ద కూడా గోడు వెళ్లబోసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాలు, గర్భిణులకు డెలివరీలు, పాముకాటు, ఇతర ప్రమాదాల్లో ఉన్న వారికి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు108 వాహనాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగా 104 వాహనాల సిబ్బంది వైద్యులతో పాటు ఇటీవల మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. ఒక్కో వాహనం రోజుకు రెండు నుంచి మూడు గ్రామాలకు వెళ్తుంది. అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని పరీక్షలు చేసి చికిత్సలు అందిస్తున్నారు. అత్యంత విలువైన వైద్య సేవలు అందించే సిబ్బందికి జీతాలు అందకున్నా ప్రభుత్వం పట్టించుకోని తీరును పలువురు విమర్శిస్తున్నారు.

అరబిందో కంపెనీ యాజమాన్యంలో కొనసాగుతున్న 104, 108 సేవలను రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించాల్సిన అవసరం ఉండగా వాటిని పట్టించుకోకపోవడంతో అరబిందో కంపెనీ యాజమాన్యం తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు సిబ్బంది వాపోతున్నారు. వాహనాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వస్తున్నాయి. స్థానిక మండలాల్లో కాకుండా ఇతర మండలాల్లో సిబ్బంది పని చేయాల్సి ఉండటంతో ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయి. నెలలు తరబడి జీతాలు లేని పరిస్థితుల్లో ఉద్యోగాలకు వెళ్లాలన్న అప్పులు చేయాల్సిన

▶ 2లో

ఉపాధిహామీ కూలి బకాయిల కోసం

15,16 తేదీల్లో ఆందోళనలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించకుంటే 15, 16 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు, 22వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. 2022-23 సంవత్సరంలో జిల్లాలోని 17 మండలాల్లో పని చేసిన కూలీలకు రూ.కోటి 69 లక్షల 47 వేల 381 రావాల్సి ఉందని, వీటిని ఇంతవరకు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, దానిలో భాగమే ఉపాధి హామీకి నిధులు తగ్గించారని తెలిపారు. ఉపాధి హామీ పనులకు గతంలో ఇచ్చే సదుపాయాలు కూడా ఎత్తివేశారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనుల్లేక, నిత్యావసర సరుకులు ధరలు పెరిగి కూలీలు నానా అవస్థలు పడుతుంటే చేసిన పనికి కూడా నెలలు తరబడి డబ్బులు చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. జిల్లాలో మండలాల వారిగా చేబ్రోలు రూ.21,29,213,

▶ 2లో

నేడు పాలీసెట్

హాజరు కానున్న 5383 మంది

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు పాలీసెట్ 2023ను బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ పరీక్ష ఉంటుంది. గుంటూరు నగరంలోని 14 పరీక్షా కేంద్రాల్లో 5383 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్, గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్, టిజెపిఎస్, హిందూ కాలేజి, ఏసీ కాలేజి, ఏసీ లా కాలేజి, ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజి, బి.హెచ్.డిగ్రీ కాలేజి, అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజి, విజ్ఞాన్ డిగ్రీ కాలేజి, విజ్ఞాన్ నిరులా, జెకెసి, మాంటిసోరి ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్, ఎంబిటిఎస్ కాలేజి ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ తెలియజేశారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు వారితోపాటు హాల్‌టిక్కెట్, బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బి పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ వెంట తీసుకెళ్లాలి. సెలఫోన్లు, కాలిక్యులేటర్లను అనుమతించరు.

మంగళగిరి వైసిపిలో ముసలం?

నగర అధ్యక్షులుగా వేమారెడ్డి నియామకంపై కలకలం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మంగళగిరి-తాడేపల్లి నగర వైసిపి అధ్యక్షులుగా సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి శంకర్‌రెడ్డి (వేమారెడ్డి)ని నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన జారీ చేసింది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తానని వేమారెడ్డి ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం ఆళ్ల రామకృష్ణారెడ్డి గెలవాలంటే వేమారెడ్డి మద్ధతు అవసరం అని పార్టీ నియమించిన ఒక సర్వే బృందం (ఐ.ప్యాక్) ఇచ్చిన నివేదికపై ఈ నియామకం జరిగిందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లోనూ రామకృష్ణారెడ్డి ఓటమికి వేమారెడ్డి ప్రయత్నించారని, ఆయన వయోభారం దృష్ట్యా ఆయన ప్రకటనలను పట్టించుకోవద్దని వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా ఉన్న జి.వేణుగోపాలరెడ్డి గ్రూపు ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి బద్ధవ్యతిరేకిగా ఉన్న వేమారెడ్డిని నగర అధ్యక్షుడిగా నియమించడంపై పార్టీలో సీనియర్ నేతలంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే ఇంకా స్పందించలేదు. ఇప్పటికే రామకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొనడం లేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా మొక్కుబడిగా పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి నారా లోకేష్‌ను ఓడించడానికి 2019లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని గ్రహించిన వైసిపి నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 2019 ఎన్నికల్లో లోకేష్ మీద పోటీ చేసిన

▶ 2లో

చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట



పల్నాడు విజ్ఞాన కేంద్రం నరసరావుపేట ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న బాలల ఉచిత శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సిపిఎం సీనియర్ నాయకులు, పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ గద్దె చలమయ్య అన్నారు. స్థానిక గుంటూరు రోడ్డు నిమ్మతోటలోని శ్రీ సిల్మన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన శిక్షణా శిబిరాన్ని గద్దె చలమయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నంబూరి సుందరరావు ప్రారంభించారు. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు, పల్నాడు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎ.భాగేశ్వరిదేవి అధ్యక్షత వహించారు. శిబిరంలో చిన్నారులకు ఉచిత హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, గణితంలో మెలకువలు నేర్పుతామని సుందరరావు తెలిపారు. బాలలకు పల్నాడు విజ్ఞాన కేంద్రం యొక్క ఆవశ్యకతను, శిక్షణ తరగతుల ద్వారా పిల్లలు నేర్చుకున్న అంశాలను ఆయా తరగతులలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ రోజు హ్యాండ్ రైటింగ్ నేర్పుటకు అనుభవజ్ఞులైన ఎంతోమంది విద్యార్థులకు విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ శిక్షణ అందించిన ఉపాధ్యాయ నిపుణులు షేక్ జున్ను సాహెబ్, మొదటి రోజు శిక్షణా తరగతులను విజయవంతం చేసిన సిబ్బందికి విద్యార్థులకు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ మస్తాన్‌వలి,

▶ 2లో

ఆస్పత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి

ప్రజాశక్తి - నరసరావుపేట



వైద్యం పొందానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న జెసి

పల్నాడు రోడ్డులోని పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం పరిశీలన చేపట్టారు. ఆస్పత్రిలోని తల్లి పిల్లల విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసేవలు, రక్త పరీక్షలు, కాన్పుల వివరములను తెలుసుకోడంతోపాటు వైద్యం పొందుతున్న వారితో మాట్లాడారు. ల్యాబ్ డిపార్ట్మెంట్ మొదటి అంతస్తులో ఉన్న దృష్ట్యా గర్భిణులు ఇబ్బందులు పడుతున్నట్లు జెసి దృష్టికి తేగా కింది అంతస్తుకు మార్చాలని ఆదేశించారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమస్యతో పాటు విద్యుత్, ఇతర ఆధునీకరణ పనులకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని డిసిహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బంది తగినంత మంది లేకపోతే నిర్వహణ కష్టంగా ఉందని, వారి పెంపునకూ ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి రంగారావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి, ఎం.సి.హెచ్ ఇంచార్జి డాక్టర్ మంత్రునాయక్, ఆర్.ఎం.ఓ డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.

చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్‌రెడ్డి, బాలోత్సవాల కన్వీనర్ కె.రామారావు, బి.నాగేశ్వరావు హనుమయ్య, పలనాడు విజ్ఞాన కేంద్రం సభ్యులు ముజఫర్ అహ్మద్, డి.శివకుమారి, సిలార్ మసూద్, నాగమ్మభాయ్, డి.బోసు, షేక్ రహీమ్ మాస్టర్, ఎన్.నరసింహరావు పాల్గొన్నారు.

మంగళగిరి వైసిపిలో ముసలం?

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌కెకు గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని సిఎం జగన్ అప్పట్లో హామీ ఇచ్చారు. మొదటి విడత ఇవ్వకపోయినా రెండో విడత ఇస్తారని ఆశించారు. కానీ రెండోసారి కూడా రాకపోవడంతో ఆర్.కె. అసంతృప్తికి గురయ్యారు. ఈ పరిస్థితుల్లో వేమారెడ్డిని నగర అధ్యక్షులుగా నియమించడాన్ని ఆర్‌కె ఎలా జీర్ణించుకుంటారన్నదీ ఆయన గ్రూపు గుంభనంగా ఉంది.

నెలల తరబడి అందని వేతనాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా 104, 108 వాహనాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న తమను అరబిందో కంపెనీ యాజమాన్యం పరిధినుంచి తప్పించి ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తున్న అప్కాస్ ద్వారా తమకు నియామక ఉత్తర్వులు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రత్యూష

కీళ్లు,కండరాల నొప్పులను అశ్రద్ధ చేయకండి

ప్రజాశక్తి-గుంటూరు

కీళ్లు, కండరాల నొప్పులను అశ్రద్ధ చేయవద్దని రుమటాలజిస్ట్ డాక్టర్ రాజవరపు. ప్రత్యూష అన్నారు. అరండల్ పేట లోని అవగాహన సంస్థ కార్యాలయంలో కీళ్ల వాతం, కండరాల నొప్పులపై ఆరోగ్య అవగాహన సభ లో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది ఒక దీర్ఘకాలిక వ్యాధి ఇదనీ, చేతులు, కాళ్లతో సహా అనేక కీళ్ళను ప్రభావితం చేసే బాధాకరమైన అనారోగ్య సమస్య అని తెలిపారు. కీళ్లు మరియు కండరాల వ్యాధుల గురించి సమగ్ర అవగాహనతో ఉన్నవారు రుమటాలజిస్టులని, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కీళ్లను ప్రభావితం చేసే రుగ్మతలు, బోలు ఎముకల వ్యాధికి ప్రధానంగా రుమటాలజిస్టులు చికిత్స అందిస్తారన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ సమస్యలు రుమటాలజిస్టు వద్దకు ఎక్కువగా వస్తుంటాయని, ఈ వ్యాధి ఉన్నవారిలో కీళ్ల లైనింగులు దెబ్బతింటాయని, చేతులు, మోకాళ్లు, మణికట్టు, వేళ్లు ఇతర కీళ్లలో వాపులు లేదా నొప్పి ఉంటుందన్నారు. ఈ వ్యాధిని ఎదుర్కోవాలంటే సరైన వైద్య సహాయం తీసుకోవాలని, ఆరు వారాల కంటే ఎక్కువ కాలం కీళ్ల నొప్పులు ఉంటే రుమటాలజిస్ట్ ని సంప్రదించాలన్నారు. కీళ్లవాతం ఉన్నవారు లేచి నిలబడటం కష్టంగా భావిస్తారని, లేచిన తర్వాత కూడా 10, 15 అడుగులు వేసే వరకు కష్టంగా ఉంటుందని అన్నారు. తగు వ్యాయామం, నడక, వైద్య చికిత్సలతో కీళ్లు కండరాల వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చన్నారు. సభలో హాజరైన వారి సందేహాలను డాక్టర్ ప్రత్యూష నివృత్తి చేశారు. అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ ప్రత్యూషను సత్కరించారు. కార్యక్రమంలో రచయిత్రి శ్రీమతి ఏ వి కే సుజాత, మమతా చంద్రశేఖర్, చైతన్య స్ఫూర్తి అధ్యక్షురాలు చందు హనుమాయమ్మ, ఏవీ సాయిరాం, తదితరులు ప్రసంగించారు.

సమస్యలుంటే 1902కు ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ సేవలను మెరుగుపరచటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఏలాంటి సమస్య అయినా 1902కి ఫిర్యాదు చేయోచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరేట్ నుండి ఎంపి అయోధ్య రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, కిలారి వెంకట రోశయ్య, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, జెసి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, ఇతర సామజిక అవసరాలకు సంబంధించిన పనులకు సంబంధించి గ్రామ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజలు అందించిన అర్జీలకు చక్కని పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించారన్నారు. కార్యాలయానికి రాలేని వారు సైతం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

1902 నెంబరుకు ఫోన్ చేసి సమస్యను తెలిపినా మంచి పరిష్కారం అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్జీల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలోనూ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. అర్జీలు వచ్చిన వెంటనే 24 గంటల్లో సంబంధిత శాఖ అధికారికి ఫార్వర్డు చేసి నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించటం జరుగుతుందన్నారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పర్యవేక్షించటానికి జిల్లాకు మైనార్టీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, అడిషనల్ సిసిఎల్‌ఎ సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ అహ్మద్‌ను నియమించటం జరిగిందని, నెలలో రెండుసార్లు ప్రత్యేక అధికారి అర్జీల పరిష్కార విధానంపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు,సలహాలు అందించటం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఫిరంగిపురం

ఏలాంటి సమస్య పరిష్కారానికైనా 1902 నంబర్‌కి ఫోన్‌చేసి ప్రజలు ఫిర్యాదు చేయోచ్చని ఎంపిపి షేక్ షహేలా నర్గీస్ సలీం తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం 1902 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూప్రభుత్వ సేవలకు సంబంధించి ఎలాంటి సమస్యలు పరిష్కారానికైనా 1902 నంబర్‌కి ఫోన్ చేసి ప్రజలు ఫిర్యాదు చేయోచ్చని తెలిపారు. ఇలా వచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారులచే పరిష్కరింపబడతాయని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ సలీం వైస్ ఎంపీపీ ఒకటి మార్పుల విజయలక్ష్మి వైస్ ఎంపీపీ 2 గుమ్మడి చంద్రం జడ్పిటిసి దాసరి కత్తి రేణమ్మ తహసీల్దార్ డి పద్మనాభుడు ఎంపీడీవో దాసరి అనురాధ యు ఆర్ డి ఎంఎల్ఎన్ కుమారి ఎస్ ఐ ఎం లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఇంగ్లీష్ కథలు

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

స్థానిక గ్రంథాలయంలో రెండో రోజు నిర్వహించిన శిక్షణ తరగతులలో రైటింగ్ స్కిల్స్, ఇంగ్లీష్ కథలు చదవడం, రాయడం పై శిక్షణ జరిగిందని ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయాధికారి బి. అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన శిబిరాలలో పలు



రకాల పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పొందాలని ఆమె కోరారు.



భవన నిర్మాణ కార్మికుడు రోశయ్యకు నివాళి

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

భవనిర్మాణ కార్మికుడు సెంట్రింగ్ వర్కర్ కొడవటిగంటి రోశయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పగడాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఏఐటీయూసీ పొన్నూరు పట్టణ సయ్యద్ ఖాసిం రోశయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఆ యూనియన్ అధ్యక్షులు పగడాల వెంకటేశ్వర్లు , సయ్యద్ కాశిం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు నియోజక వర్గం అధ్యక్షులు రామారావు, యూనియన్ నాయకులు ఏడుకొండలు, కిరణ్ కాంతారావు, శీను,మున్నా, తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

దుగ్గిరాల రూ.17,03,127, గుంటూరు రూరల్ రూ.10,89,874, కాకుమాను రూ.6,31,116, కొల్లిపర రూ.4,08,706, మంగళగిరి రూరల్ రూ.9,27,508, మేడికొండూరు 15,45,969, పెదకాకాని రూ.12,88,686, పెదనందిపాడు రూ.5,08,110, ఫిరంగిపురం రూ.14,57,940, పొన్నూరు రూ.12,92,891, ప్రత్తిపాడు రూ.8,69,163, తాడికొండ రూ.2,00,185, తెనాలిరూరల్ రూ.13,93,526, తాడేపల్లి రూరల్ రూ.1,15,917, తుళ్లూరు రూ.10,05,804, వట్టిచెరుకూరు రూ.3,79,946 చొప్పున ఉపాధిహామీ కూలి బకాయిలు ఉన్నట్లు వివరించారు.



ముగిసిన పక్షం-2023

ప్రజాశక్తి-తాడేపల్లి: పక్షం-2023 ముగింపు కార్యక్రమం తాడేపల్లిలోని హిందుస్థాన్ కార్పొరేషన్ లిమిడెట్ రిటైల్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.కమలాకరబాబు, రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్ ఎ.సంజయ్‌కుమార్ మాట్లాడారు. పక్షం- 2023 సందర్భంగా ఒఎంసిల ద్వారా వివిధ ఇంధన సంరక్షణ అవగాహనా కార్యకలాపాలు ఏప్రిల్ 24 నుంచి మే 8వ తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. వాకాథాన్, సైక్లోథాన్, ఎల్‌పిజి వంటి కార్యకలాపాలు, పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ద్వారా గ్రూపు చర్చలు, డిబెట్‌లు, వాల్ పెయింటింగ్‌ల ద్వారా అవగాహన కల్పించినట్లు చెప్పారు. రైతులు, ట్రక్కు డ్రైవర్లతో గ్రూపును ఏర్పాటు చేసి మాట్లాడటం జరిగిందని వివరించారు. చమురు, గ్యాస్ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ హై స్కూల్‌లో తనిఖీ

ప్రజాశక్తి -మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌ను మంగళవారం ఆర్జెడి సుబ్బారావు ఆకస్మిక తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా పంపిణీ చేయనున్న జగనన్న విద్యా కానుక స్టోరేజ్ పాయింట్లను పరిశీలించారు. పలు రకాల సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎస్ వెంకటేశ్వర్లు , కే జయప్రద, పలువురు విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు



ఃమాట్లాడుతున్న ఆర్‌జెడి సుబ్బారావు

రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి -మేడికొండూరు:రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రం అబివృద్ధికి కృషి చేస్తుందని వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మేడికొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కాలనీలలో ప్రతి గడప తిరిగారు. కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్



అదుపు తప్పి బ్యాటరీల లారీ బోల్తా

ప్రజాశక్తి -ప్రత్తిపాడు: బ్యాటరీల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి పడిన సంఘటన ప్రతిపాడు మండల పరిధిలోని యనమదల ఎన్ హెచ్ 16లో చోటు మంగళవారం చేసుకుంది. వివరాలు ప్రకారం బిబి25ఎల్ 5703గల లారి ఎక్సీడ్ బ్యాటరీల లోడ్‌ను వెస్ట్ బెంగాల్ నుంచి బెంగళూరు తీసుకెళ్తున్నా క్రమంలో ప్రత్తిపాడు మండల పరిదిలోని యనమదల వద్ద లారి మార్జిన్ దాటి కిందకు దిగడంతో లోడ్‌తో ఉన్న లారి ఒక్కసారిగా అదుపు తప్పి సర్వీస్ రోడ్డు పై పడింది లారిలో ఉన్న డ్రైవర్ శుభాష్ కుమార్‌కుగాని, క్లినర్ లాల్ బాబులకు స్వల్ప గాయలు అయ్యాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

మీసేవా నిర్వాహకుడు నవీన్ కన్నుమూత



మన్నెం నవీన్ కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నగరంలోని విజయ డీలక్స్ వద్దగల హరిహర కమ్యూనికేషన్ మీసేవ కేంద్ర నిర్వాహకుడు మన్నెం నవీన్ కుమార్ (35) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. మన్నెం వారి వీధిలోని నవీన్ కుమార్ నివాస గృహం వద్ద భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. నవీన్ కుమార్ మృతికి సంతాపంగా మంగళగిరిలోని మీసేవ నిర్వాహకులు స్వచ్ఛందంగా కేంద్రాలను మూసివేసి సంతాపం తెలిపారు



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	98,220
మిర్చి ఎగుమతి	:	1,03,067
మిర్చి నిల్వ	:	59,204

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9000 - 22000
నెం.5	10000 - 21000
273	10000 - 22000
341	9000 - 22000
4884	16500 - 16500
సూపర్ -10	15500 - 16000
నాన్ ఎసి	
తేజ	9000 - 24000
బడిగి	10000 - 23000
దేవనూరుడీలక్స్	9000 - 20000
తాలుకాయలు	6000 - 13500

మంచి అలవాట్లు అలవర్చుకోండి..

ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్



పిల్లల చేత మ్యాజిక్ చేయిస్తున్న క్రాంతి కుమార్

ప్రజాశక్తి-తాడేపల్లి

చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా పిల్లలు సమాజంలో ఉన్నతస్థితికి చేరుకుంటారని ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ అన్నారు. అలాగే చెడును వదిలేయాలని కోరారు. ఈ అంశం మీద హ్యాబిట్ అనే ఇంగ్లీషు ఐదు అక్షరాలను కాగితం మీద చేసి చూపించారు. రెండు కాగితాలను తీసుకుని హ్యాబిట్ అనే ఐదు అక్షరాలను అందులో పొందుపరుస్తారు. ఒక్కో అక్షరాన్ని చింపి ఒక దాని మీద ఒకటి పెట్టి మడిచిన తరువాత మరలా కాగితం ఒకటిగా వచ్చి యధావిధిగా ఇంగ్లీషు ఐదు అక్షరాలు హ్యాబిట్ కనబడుతుంది. దీంతో పిల్లలు సంబ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఒక రూపాయి కాయిన్‌ను క్లాత్ మీద పెట్టి రెండు రింగులను అటుఇటు మార్చగానే కాయిన్ మాయమైపోతుంది. ఈ మ్యాజిక్ పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ స ందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కోరే వారు ఉన్నట్లే సమాజంలో మత విద్వేషాలు రగిలిచ్చే వారు కూడా ఉంటారని, వారి పట్ల జాగురకుతతో వ్యహరించాలని చెప్పారు. కులమతాలకు అతీతంగా మనందరం భారతీయులమనే సందేశాన్ని ప్రజలకు ఇచ్చే విధంగా అందరూ పాటుపడదామని తెలిపారు. భారతదేశాన్ని విచ్చిన్నం కాకుండా కలిసి ఉంచే దానికి శాయశక్తులా ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. మంగళవారం మ్యాజిక్‌కు సంబంధించి ఐదు అంశాలను పిల్లలకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో మేజిషియన్ పిచ్చయ్య, విశ్రాంత ఎంపిడిఒ పాల్గొన్నారు.



విద్యార్థిని ఉదయ నాగలక్ష్మిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థి ఉదయ నాగలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరానికి చెందిన జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని అప్పికట్ల ఉదయ నాగలక్ష్మికి ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోనే అత్యధిక మార్కులు 588 సాధించింది. విషయం తెలుసుకున్న గ్రామ టిడిపి నాయకులు, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన నారా లోకేష్ రూ.10వేలు ప్రోత్సాహక బహుమతిని వడ్డేశ్వరం గ్రామానికి పంపించారు. మంగళవారం టిడిపి నాయకులు జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చి, పదో తరగతి ఫలితాలలో టాపర్గా నిలిచిన అప్పికట్ల ఉదయ నాగలక్ష్మిని శాలువాతో సన్మానించి, రూ.10వేలను ప్రోతాహకం బహుమతని అందించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు, గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు,గ్రామ కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, ఎస్సీసెల్ నాయకులు బెజ్జం రామకృష్ణారావు,తెలుగు యువత నాయకులు ఎస్‌కే నాగూర్ వలి, పాఠశాల ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, డివి రమణమ్మ, ఉమాదేవి తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- **తహశీల్దార్ కార్యాలయాల్లో టిడిపి, కాంగ్రెస్ నాయకుల వినతి**
- **ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్**



పొన్నూరులో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తు టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని కోరుతూ పొన్నూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు 4 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, పొన్నూరు నియెజికవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావుతదితరలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు:అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరాకు రూ.25వేలను తక్షణ సాయంగా అందజేసి ఆదుకోవాలని ప్రతిపాడు టిడిపి మండల అధ్యక్షులు గింజుపల్లి శివరాంప్రసాద్ మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం. లీలా సంజీవ కుమారికి వినతి పత్రం అందజేశారు. అలాగే గత నెల 23న పాత మల్లయ్యపాలెంలో పిడుగుపాటుకు మృతి చెందిన చాట్ల శ్యాంబాబు, కొరివి కృపానందంలకు ప్రభుత్వపరంగా వచ్చే నష్టపరిహాన్ని వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర రైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజు పల్లి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జీడిసిబి వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి బసవ బాబు, ఎస్సీ సెల్ నాగరాజు, వెలివెల్లి సుబ్బారావు పాల్గొన్నారు

తెనాలి: వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రైతుల సంక్షేమం కోసం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆ నిధులతో రైతులు, కౌలురైతులకు పరిహారం చెల్లించాలని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, జొన్న మొక్కజొన్నను కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు పి.నాగసూర్యశశిధరరావు, కె.బుల్లియ్య పాల్గొన్నారు.

మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకోవద్దు



కొల్లిపర :వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రతి రైతు తమ పంటలను మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకోవద్దని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు మంగళవారం మండలంలోని అన్నవరం హనుమాన్ పాలెం, తూములూరు, కొల్లిపర, శివలూరు గ్రామాలలో పర్యటించి వర్షాల వలన దెబ్బతిన్న పసుపు, మొక్కజొన్న ,అరటి పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేస్తున్నారని ,వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శివలూరు నుండి మున్నంగి వెళ్లే దారిలో వంతెన దెబ్బతిన్నదని రైతులు తెలుపుగా ఆ వంతెనను పరిశీలించి నూతనవంతెన నిర్మాణం కొరకు నివేదికను తయారుచేసి వెంటనే నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి ఉద్యానవన శాఖ అధికారి కే వెంకట్రావు ఎంపీడీవో పి శ్రీనివాసులు,ఎ. పోతిరెడ్డి, బి,సంజీవరెడ్డి , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-తాడేపల్లి

సోమవారం కృష్ణానదిలో గల్లంతైన ఇరువురు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కృష్ణాజిల్లా యనమలకుదురుకు చెందిన నలుగురు యువకులు దాసరి రాజకమల్, విశ్వనాథపల్లి జీవన్‌బాబు, చంద్రరత్న రాకేష్, జాన్ బనియన్ కృష్ణానదిలో ఈతకు దిగారు. వీరిలో ఇద్దరు గల్లంతయ్యారు. మిగతా ఇద్దరు పెద్దగా కేకలు వేశారు. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో వారి అరుపులు అరణ్యరోదనగా మారాయి. మంగళవారం ఉదయం నుంచి తాడేపల్లి పోలీసులు కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన రాకేష్, జాన్ బనియన్ మృతదేహాలను రైలు బ్రిడ్జి సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను మంగళగిరి మార్చురీకి తరలించి సిఐ శేషగిరిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకులు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -తెనాలి



నిందితుడు టి. గోపి

చోరీ కేసులో నిందితుని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు ప్రకారం అంగలకుదురు గ్రామంలో ఈనెల7న రాత్రి వేళ పల్నాడు జిల్లా,రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపి చోరీ చేయాలని ఓ ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న మహిళ మెడలో చేను లాగి ,సెల్ ఫోన్ చోరీ చేసి పారిపోయే క్రమంలో ఇంటిలోని వారు చూసి కేకలు వేశారు.వారి కేకలతో నిందితుడు పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై గతంలో కూడా కేసులు నమోదైనట్లు చెప్పారు.

అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న చేలు దగ్ధం

ప్రజాశక్తి -తెనాలి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న చేలు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని అంగకుదురులో చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగలకుదురులో పిడపర్తి ప్రదీప్ కుమార్, కూచిపూడి లక్ష్మయ్య, నలుకుర్తి నాగరాజుకు చెందిన మొక్కజొన్న చేలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. దాదాపు మూడు ఎకరాల్లో పంట అగ్నికి ఆహుతైంది. గ్రామస్తుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ వైర్లు వేలాడుతున్న కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని, ప్రమాదంలో సుమారు రెండున్నర లక్షల మేర ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చని అంచనా వేశారు

అధిక లోడుతో వెళుతున్న లారీలకు జరిమానా

ప్రజాశక్తి- తెనాలి

అధికలోడుతో వెళుతున్న ఇసుక లారీలను స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పరిమితికి మించిన ఇసుక లోడుతో వెళుతున్న రెండు లారీలను గుర్తించారు. ఒక్కోలారికి రూ.10 వేల చొప్పున ఎస్ఈబి సీఐ చలం జరిమానా విధించారు.



రమేష్‌కు ఇంటి పట్టా అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

సిఎం హామీ మేరకు ఇంటి పట్టా...

ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇంటి స్థలం హామీ నెరవేరింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించేందుకు ఇటీవల పల్నాడు జిల్లా చిలకలూరిపేట ప్రాంతానికి వచ్చిన సిఎం సభలో చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన ముచ్చు రమేష్ మాట్లాడి తన అనారోగ్య సమస్యలను, కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించారు. తనకు తరచూ డయాలసిస్ చేయాల్సి ఉంటుందని, ఇల్లు కూడా సరిగా లేదని ఇంటి స్థలం కోసం విన్నవించారు. ఇంటి స్థలం ఇప్పిస్తామని సిఎం హామీనిచ్చారు. సిఎం ఆదేశాలతో కావూరులో ఇంటి స్థలం కేటాయించి పట్టాను బాధితుడు రమేష్‌కు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం కలెక్టరేట్‌లో అందజేశారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి సరిత

ఉన్నవలో సాగుకు సమాయత్తం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉన్నవలో 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక ఆర్‌బికె కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ సరిత మాట్లాడుతూ పంట మార్పిడి, పంట రకాలు, విత్తనాల కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఆ ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. యంత్రసేవ పథకం ద్వారా రాయితీపై డ్రోన్లు ఇస్తారని చెప్పడంతోపాటు వాటిని ఇప్పటికే వినియోగిస్తున్న రైతుల అనుభవాలను వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచామని కావాల్సిన వారు తీసుకోవాలని అన్నారు. కౌలురైతులు పంటసాగు ధ్రువపత్రాల (సిసిఆర్‌సి) కోసం విఆర్‌ఒను లేదా రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలను హార్టికల్చర్ అధికారి జి.కిషోర్‌యాదవ్ వివరించారు. నేరేడు పంటసాగు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లను 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సిహెచ్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా జీతాలివ్వకుంటే బతికేదెలా?

- ఇదే తీరు కొనసాగితే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- ఐదు రోజులకు తుమ్మలచెరువు పారిశుధ్య కార్మికుల దీక్షలు




దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జి.రవికుమార్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

నెలల తరబడి పెండింగ్‌లో ఉంచిన జీతాల కోసం మండలంలోని తుమ్మలచెరువు పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఐదురోజులుగా చేస్తున్న దీక్ష శిబిరాన్ని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు జి.రవిబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఏడు నెలల జీతాల కోసం కార్మికులు ఆందోళ చేస్తున్నా స్థానిక పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని, జీతాలు ఇవ్వకుంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పంచాయతీ నుంచి రూ.2 వేలు చొప్పున ఇస్తానని చెప్పిన సర్పంచ్ 30 నెలల జీతం ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఇప్పటికైనా జీతాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే సచివాలయం ముట్టడికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కార్మికులు బి.రాజేష్, జి.సుందర్రావు, బి.సుందర్‌రావు, ఎలేషా, సామేలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముగిసిన శిక్షణ



బహుమతులు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

పాలీసెట్, ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షల కోసం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో 20 రోజులుగా ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. దాదాపు వందమంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు అప్పరాజు నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యుటిఎఫ్ సామాజిక స్పృహతో పని చేస్తుందని చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందించడంతోపాటు గ్రాండ్ టెస్ట్‌లో మొదటి రెండుస్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. తరగతులు బోధించిన ఉపాధ్యాయులకు కవి కరిముల్లా రాసిన 'వినుకొండ చరిత్ర' పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు, ఆర్.అజయ్ కుమార్, పీఏ జిలాని, ఐ.రామిరెడ్డి, డి.రవికుమార్, బి.భాస్కర్, ఎ.వీరాంజనేయులు, సిహెచ్ చంద్రశేఖర్, పి.సురేష్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



నకరికల్లులో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు తదితరులు

ప్రజాశక్తి - నకరికల్లు

అకాల వర్షాల కారణంగా రెండేళ్లుగా పంటలను నష్టపోతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు డిమాండ్ చేశారు. చంద్రబాబు పిలుపు జిల్లాలోని పలు మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం నిరసనలు చేపట్టాయి. ఇందులో భాగంగా నకరికల్లులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వైవి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనావేసి తర్వాత గతిన పరిహారం అందజేయాలన్నారు. వరి, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహార ఇవ్వాలని, రాయితీపై విత్తనాలు అందించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.కోటేశ్వరావు, నాయకులు పి.రామయ్య, ఎ.పుల్లమ్మ, జె.రామాంజనేయులు, ఎన్.జానకిరామయ్య, శ్రీహరి, రాంబాబు, వెంకట్రావు, రంగయ్య, అనిల్ పాల్గొన్నారు. **సత్తెనపల్లి** తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన చేయగా రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు ఎ.సాంబయ్య బి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, వి.అజయ్, ఎం.రాంచంద్రరావు పాల్గొన్నారు. మండల కేంద్రమైన **ముప్పాళ్ల**లో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహశీల్దార్ భవానీశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టిడిపి మండల అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, నాయకులు ఆర్.నానయ్య మాట్లాడారు. నార్నెపాడు సర్పంచ్ పి.యల్లమంద, నాయకులు పి.అయోధ్య రామారావు, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన **యడ్లపాడు**లోని టిడిపి కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం ప్రదర్శన అనంతరం తహశీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. టిడిపి మండల అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, నాయకులు ఎం.వీరారెడ్డి, కె.అప్పారావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సిఎం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించగా పల్నాడు జిల్లా కలెక్టరేట్ నుండి వర్చువల్‌గా హాజరైన జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ తదితరులు





కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి

ఉపాధి హామీలో పాతపద్ధతినే అమలు చేయాలి

22న కలెక్టరేట్ వద్ద ధర్నా : వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - రాజుపాలెం

ఉపాధి హామీ కూలీలకు పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త యాప్ విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మొక్కపాడు, బ్రాహ్మణపల్లి, రాజుపాలెం, గణపవరం గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాలను నాయకులు మంగళవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పని కల్పిస్తున్న చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాక ఉపాధి హామీని మొత్తం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం పేరుతో తన కేంద్రం గుప్పిట్లో పెట్టారని, చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వాలకు పాత్ర లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రెండు పూటల పని పద్ధతిని ఎత్తేయాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, సైట్ సూపర్వైజర్లకు వేతనాలు చెల్లించాలని, తాగునీరు, పని ముట్లకు అలవెన్సులు, ప్లే సిప్పులు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై ఈనెల 22న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కూలీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పిచ్చిరెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దుపై రాష్ట్రాలు ప్రశ్నించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వెనకబడిన ముస్లిమ్ మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 4 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేడయం సరికాదని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ బాజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, ఇతర నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యం ఏదో ఒక రూపంలో మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని, ముస్లిమునుల లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని అన్నారు. తాజాగా రిజర్వేషన్ల రద్దుకు పూనుకుందని, రాజ్యాంగాన్ని మోడీ, అమిత్‌షా ధ్వయం ధ్వంసం చేస్తోందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడుకోవాలంటే మతోన్మాద బిజెపి చర్యలను తిప్పికొట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో షేక్ మస్తాన్‌వలి, టి.రాజారమేష్, పి.వెంకటేశ్వర్లు, బి.భగత్‌సింగ్, భానుప్రసాద్, షేక్ గౌస్, అల్లాబక్షు, ముత్తయ్య, చంద్ర, ఎ.మోహన్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.రాధాకృష్ణ



పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

రాజధాని గ్రామాల్లో 3వ రోజూ నిరసనలు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని గ్రామం అనంతవరంకు చెందిన పారిశుధ్య కార్మికుడు శేషయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, పారిశుధ్య కార్మికులు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మంగళవారం డిమాండ్ చేశారు. అనంతవరంలో కార్మికులు పారిశుధ్య విధులు మానేసి, పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కో ఆర్డినేటర్ నరసింహారావు మొండి వైఖరితో పారిశుధ్య కార్మికుల సమస్యలు జఠిలమవుతున్నాయని రవి అన్నారు. సోమవారం నరసింహారావు అనంతవరం వెళ్లి శేషయ్యను పనిలోకి తీసుకునేది లేదంటూ కార్మికుల ముందు చెప్పడం సరికాదని అన్నారు. కార్మికులపై సిఆర్‌డిఎ సూపర్‌వైజర్‌ల వేధింపులకు నిరసనగా నెక్కల్లులో సోమవారం నుంచే కార్మికులు విధులు మానేసి నిరసన తెలుపుతున్నారని చెప్పారు. నెక్కల్లు కార్మికులతో



రాజధాని గ్రామం అనంతవరంలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పాటు మంగళవారం అనంతవరం గ్రామానికి చెందిన కార్మికులు కూడా విధులు మానేసి నిరసనలకు దిగారని చెప్పారు. కార్మికులపై వేధింపులను నిరసిస్తూ శేషయ్యను పనిలోకి తీసుకునేవరకు విధులకు దూరంగా ఉండేందుకు కార్మికులు సంసిద్ధులవుతున్నారని చెప్పారు. రాజధానిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులపై కోఆర్డినేటర్ నరసింహారావు, కొందరు సూపర్‌వైజర్‌ల వేధింపులకు నిరసనగా రాజధాని గ్రామాల్లో కార్మికులు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయని రవి చెప్పారు. కార్మికుడు శేషయ్య తమ వద్దకు వచ్చి బ్రతిమలాడుకోవాలే తప్ప విజయవాడ వెళ్లి సిఆర్‌డిఎ కమిషనర్‌కి అర్జీ ఇచ్చినంత మాత్రాన పనిలోకి తీసుకోవడం కుదరదని ఖరాఖండీగా కార్మికుల వద్ద చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితిలో కార్మికులు పనులు మానేసి ఆందోళన బాట పట్టారని, వారికి మద్దతుగా ఇతర గ్రామల కార్మికులు నిరసన తెలుపుతున్నారన్నారు. ఇప్పటికైనా సిఆర్‌డిఎ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రవి డిమాండ్ చేశారు.

ఉపాధి బకాయలు వెంటనే చెల్లించండి : వ్యకాస

22న కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకాని మండలంలో ఉపాధి కూలీలకు గత సంవత్సరం రావలసిన రూ.12 లక్షల 88 వేల 686ల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించి ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పలపాడు గ్రామంలో గత సంవత్సరం రూ.93,544 వేతనాలు రావాల్సి ఉందని వాటిని వెంటనే చెల్లించాలని వారు కోరారు. పనిచేసిన వాటికి కూడా డబ్బులు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని అధికారులను వారు ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని దానిలో భాగమే నిధులు తగ్గించేసారని తెలిపారు. అలాగే రెండు పూటలా పని విధానం తీసుకువచ్చారని, దీనివల్ల ఉదయం పూట నాలుగు కిలోమీటర్లు సాయంత్రం పూట నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి పనిచేయాల్సిన పరిస్థితి ఉందని దీనివల్ల కూలీలకు ఈ పని యడల ఆసక్తి తగ్గుతుందని



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

తెలిపారు. గతంలో ఇచ్చిన సదుపాయాలను కూడా తీసివేశారని, ఎక్కడ కూడా మెడికల్ కిట్లు గాని, టెంట్లు గాని, పలుగు, పారుకు డబ్బులు ఇవ్వటం లేదని ఇది దారుణం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, గతంలో ఇచ్చిన సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు. లేనిచో మే 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

అధికారులకు వినతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్షాలకి దెబ్బతిన్న మొక్కజొన్న జొన్న పంటలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ ఈరోజు దుగ్గిరాల తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రోజుల పాటు కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మొత్తం పంటలను ఆర్ బికేలద్వారా కల్లాలోనే పంటలు కొనుగోలు చేయాలని కోరారు తేమశాతంతో నిమిత్తం లేకుండా నిభంధనలు సడలించి గొనేసంచులు ప్రభుత్వం సరపరా చేయాలని కోరారు



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సాగుదారులకి టార్పాలిన్ పట్టాలు సబ్సిడీ ద్వారా సప్లై చేయాలని కోరారు. పసుపు పెసర పంటలు కొనుగోలు చేయాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె. కళ్యాణికి అందజేశారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు రైతు సంఘం మండల కార్యదర్శి వైబ్రహ్మేశ్వరావు కౌలురైతు సంఘం మండల కార్యదర్శి యం నాగమల్లేశ్వరావు రైతు సంఘం నాయకులు వి సాంబశివరావు కె. కోటయ్య బి అమ్మిరెడ్డి సిహెచ్ పోతురాజు జి శ్రీనివాసరావు యల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సమస్య ఫిర్యాదుపై డిపిఒ పరిశీలన

సమస్యను వివరించిన మహిళలపైనే ఆగ్రహం!

ప్రజాశక్తి-తెనాలి: రూరల్ గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై గ్రామస్తుల పిర్యాదు మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి గ్రామంలో పర్యటించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. 12వ వార్డు సభ్యురాలు కొలకలూరి అరుణకుమారి డిపివోకు సమస్యను వివరించారు. ఎస్సీ కాలనీలోకి వచ్చే మెయిన్ పైప్‌లైన్ నుంచి కప్పలగుంట, మెయిన్‌రోడ్డు పక్కనున్న జడ్పీ గ్రౌండ్ పక్క ప్రాంతానికి నేరుగా కనెక్షన్ ఇవ్వటంతో ఎస్సీ కాలనీలోకి నీటి సరఫరా పూర్తిగా తగ్గిపోయిందని వివరించారు. వేసవిలో తీవ్రమైన నీటి కొరత ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని డిపివో స్పష్టం చేశారని,



ఎస్సీకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న డిపిఒ కేశవరెడ్డి

ప్రత్యామ్నాయం కూడా చూపలేమని బదులిచ్చినట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు కూడా ఏమీ చేయలేమంటే సమస్య ఎవరికి చెప్పుకోవాలంటూ మహిళలు నిలదీశారు. మహిళలపై ఒకింత అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన అక్కడి నుంచి వెళ్ళిపోయారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఎనిమిది నెలల క్రితం గ్రామంలో పైప్‌లైన్ కలుషితం కారణంగా డయేరియా ప్రభలి బాలిక మృతి చెందటం, అప్పుడు తాత్కాలికంగా నీటి సరఫరా నిలిపివేసిన అధికారులు, తిరిగి నీటి సరఫరా పునరుద్ధరించినా నేటికీ పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించలేకపోయారు. దీనిపై డిఎల్పీవో శ్రీనివాసనాయక్‌ను సంప్రదించగా నీటి సమస్యపై పిర్యాదు ఉందని, దాని పరిశీలన నిమిత్తం వచ్చామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ సిబ్బందిని డిపివో ఆదేశించినట్లు చెప్పారు. అలాగే అరోపణలున్న పైప్‌లైన్‌ను కూడా పరిశీలించాలని, గృహావసరాలకు వినియోగించే నీటి మోటార్లను అదుపు చేయాల్సిందిగా కూడా పంచాయితీ సిబ్బందికి సూచించారని, జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ కోటికి పైగా నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే సమస్య పరిష్కారమౌతుందన్నారు. ఏది ఏమైనా అరకొర నీటి సరఫరాతో ఎస్సీ కాలనీ వాసులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిపివో వెంట ఈవోపిఆర్డీ ప్రభాకరరావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'పది' ఫలితాల్లో రవీంద్ర భారతి ప్రతిభ

ప్రజాశక్తి-తాడేపల్లి



ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టడం ద్వారా పది ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించామని తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని రవీంద్ర భారతి స్కూల్ డైరెక్టర్, కరస్పాండెంట్ ఎస్‌కె ఖమ్మర్ హుస్సేన్ తెలిపారు. ఎన్‌వి జ్ఞానచరణ్ 561 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచాడని చెప్పారు. ఒ.దినేష్‌కుమార్ 558 మార్కులు, డి.ఇస్సాక్ అభిలాష్ 542, ఎస్‌కె ఫాతిమా ఫరజానా 525, సిహెచ్.నాగచరణ్ 522, బి.లోకేష్ 517 మార్కులు సాధించినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సహకరించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. అలాగే దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర ఆపై పరీక్షలకు శిక్షణ ఇవ్వడంతో పాటు గణితంలో అబాకస్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

టిడ్కో ఇళ్లను తక్షణమే అప్పగించాలి

నేడు సిపిఎం అధ్వర్యంలో తాళ్లాయపాలెంలో ధర్నా

హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలో పేదలకు నిర్మించిన 5,024 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం రాజధాని గ్రామం తాళ్ళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గృహాల లబ్ధిదారులతో ఉదయం 11 గంటలకు ధర్నా జరుగుతుందని, ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి హెచ్ బాబురావు పాల్గొంటారని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి తెలిపారు. సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో అప్పులు చేసి రూ. లక్ష, 50 వేలు, 500 చొప్పున పేదలు లబ్దిదారుని వాటాగా సిఆర్‌డిఎకు చెల్లించి ఇళ్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, లబ్ధిదారులకు ఒక్కరికి కూడా ఇప్పటివరకు గృహాలు అప్పగించలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాజధాని గ్రామాల్లోని టిడ్కో గృహాల వద్ద యుద్ధ ప్రాతిపదికన విద్యుత్, మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు సత్వరమే అప్పగించాలని కోరుతూ నిర్వహించే ధర్నాలో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని ఎం రవి మంగళగవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులతో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్ల వారీగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నదీ, మౌలిక వసతులు, బిల్లుల చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, ఏమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనులు వేగంగా చేపట్టాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లేఅవుట్ నుండి కాంట్రాక్టర్ ప్రతిరోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. లేఅవుట్‌ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని, ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి పనుల వేగవంతంకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లే అవుట్‌లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఈ భాస్కర్, ఈ.ఈ. సుందర్రామిరెడ్డి, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటలు చెప్పినా.. డబ్బులు ఇస్తేగా..

- **పాఠశాలలకు మూడేళ్లుగా విడుదలవ్వని నిర్వహణ నిధులు**
- **హెచ్ఎంల జీతాల నుండి ఖర్చులు**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పాఠశాల నిర్వహణకు అవసరమయ్యే నిధులకు ఇక ఇబ్బంది ఉండబోదని, గత ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి మొత్తం కాకుండా సరిపడా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్ బిల్లులు, పెన్నులు, తాళాలు, బోధన సామగ్రి, కిటికీల మరమ్మతు, చీపుర్ల కొనుగోలు తదితర అవసరాల కోసం పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ సిస్టం (పిఎఫ్ఎంఎస్) ఖాతాకు నిధులను జమ చేయాల్సి ఉన్నా మూడేళ్లుగా విడుదల చేయడం లేదు. దీంతో హెచ్ఎంలు, ఉపాధ్యాయులే డబ్బులు సమకూర్చుకుని పనులు చేయించుకోవాల్సి వస్తోంది.



పాఠశాలల స్థాయి, విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ప్రతినెలా నిర్వహణకు స్కూల్ గ్రాంట్స్ పేరుతో ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పింది. ప్రాథమిక పాఠశాలలైతే రూ.20-50 వేలు, ఉన్నత పాఠశాలలైతే రూ.50-70 వేలు ప్రతినెలా ఇవ్వాల్సి ఉంది. చిలకలూరిపేట పట్టణంలోని ఓ పాఠశాలలో 900-1200 మంది విద్యార్తులు ఉండగా 31 తరగతి గదులు ఉన్నాయి. మరో 14 నిర్మాణంలో ఉన్నాయి. ఇవికాకుండా మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, ఇతర గదులు ఉన్నాయి. వీటన్నింటిల్లో 70 వరకూ ఫ్యాన్లు ఉండగా ప్రతినెలా విద్యుత్ బిల్లులే వేలల్లో వస్తాయి. ఈ పాఠశాలకు ప్రభుత్వ నిబంధన ప్రకారం రూ.50 వేలు రావాల్సి ఉంది.

ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్లు నిర్వహించేవారు. పిల్లలకు చిక్కీలతోపాటు అల్పాహారం అందించేవారు. ఒక్కో విద్యార్థికి రూ.12 వరకూ ఖర్చవుతుండగా ఇందులో ప్రభుత్వం రూ.7 ఇచ్చేది. మరో రూ.5 తాము భరాయించామని హెచ్ఎంలు చెబుతున్నారు. గత ప్రభుత్వం నెలకు రూ. 5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలను పిఎఫ్ఎంఎస్ ఖాతాకు జమ చేయగా ఇప్పుడు అది పెరిగినా ఫలితం లేకుండా పోయిందని హెచ్ఎంలు వాపోతున్నారు.

చిలకలూరిపేట పట్టణంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 27, ఉన్నత పాఠశాలలు రెండు ఉన్నాయి. మండలంలో 35 ప్రాథమిక, 8 ఉన్నత పాఠశాలలు మొత్తంగా 82 పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలలకు గ్రాంట్స్ కింద ప్రతినెలా ఇవ్వాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం సరిగా ఇవ్వడం లేదని హెచ్ఎంలు చెబుతున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో 3 నెలలకు సంబంధించిన నిధులు జమ చేసినట్లు కాగితాల్లో చూపుతున్నా ఖాతాల్లో జమవ్వలేదని అంటున్నారు. కనీసం ఇప్పుడైనా విడుదల చేస్తే వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలను సిద్ధం చేసుకోవడానికి ఉపయోగపడతాయని భావిస్తున్నారు. విద్యార్థులకు స్టడీ అవర్స్ సందర్భంలో కిరాణా దుకాణం నుండి సరుకులు తెచ్చి అల్పాహారం అందించామని, వాటిని తమ జీతంలో నుండి చెల్లించామని ఓ హెచ్ఎం వాపోయారు. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఇంతే ఉందని, ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - క్రోసూరు


బాల నవ్యత

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని మాదిరెడ్డి బాలనవ్యత 582 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానం సాధించింధించినట్లు ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు. తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 576 మార్కులతో నెల్లూరి మైనా పాఠశాలలో ద్వితీయ స్థానం, 564 మార్కులతో అత్తలూరి సువర్షిణి పాఠశాలలో తృతీయ స్థానం పొందగా 500 మార్కులకు పైగా మార్కులను 15 మంది సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని బాలనవ్యత మాట్లాడుతూ ఐఐటిలో సీటు సాధించడమే తన లక్ష్యమని చెప్పారు.

భానుడి భగభగ

ప్రజాశక్తి - అచ్చంపేట

మొన్నటి దాకా వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. మరోవైపు ప్రజలు ఎండలు లేకపోవడంతో కాస్తంత సేదదీరారు. అయితే రెండ్రోజులుగా మొదలైన ఎండలు ఉక్కపోతతో ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేటలోని అమరావతి రోడ్డులో స్టేట్ బ్యాంకు వద్ద నిలుపుతున్న ద్విచక్ర వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాటిని ఇతర ప్రాంతాల్లో నిలిపి వెళ్తున్నారు. లారీలు వచ్చిన సందర్భంలో ఆవి వెళ్లడానికి సరైన మార్గం లేక ప్రతిసారీ 20 నిముషాలకు పైగా వాహనాలు స్తంభిస్తున్నాయి. ప్రజల్ని, వాహనదార్లను ఇబ్బందికి గురిచేస్తున్న ఈ సమస్యకు అధికారులు త్వరగా పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - వెల్దుర్తి

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని హారిక ఈ-టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ హారిక అన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు.

కార్తీకను సత్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అచ్చంపేట : స్థానిక విద్వాన్ హైస్కూల్ దుర్గాసిరి కార్తీక పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించినందుకు గాను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం గుంటూరులోని తన కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఆరోగ్య కేంద్రంలో జిల్లా అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - మాచవరం : మండల కేంద్రమైన మాచవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డాక్టర్ పద్మ మంగళవారం సందర్శించారు. గర్భిణుల గుర్తింపు, వైద్యం, ప్రసవం తదితర అంశాలపై ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం గురించి మాట్లాడారు. అనంతరం స్థానిక ఎస్టీ కాలనీలో ఫ్యామిటీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి, డాక్టర్ ఎస్.ప్రసాద్‌రావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి ఓటరు దగ్గరకూ వెళ్లండి : శ్రీధర్

ప్రజాశక్తి - పెదకూరపాడు

వైసిపి ప్రభుత్వము ప్రజా వ్యతిరేక విధానాలను, అరాచకాలను ఎండగట్టాలని టిడిపి కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఓ కళ్యాణ మండపంలో నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఓటర్‌ను కలవాలని, ప్రభుత్వ లోపాలను వివరించాలని చెప్పారు. ప్రతి అంశములో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల నియోజకవర్గంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారాన్ని ఇవ్వాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యకర్తలతో కలిసి వెళ్లి తహశీల్దార్ క్షమారాణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు రమేష్, అప్పారావు, ముంతాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

పాఠశాలకు వసతులు సమకూరుస్తాం..

అచ్చంపేట జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చంపేట జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని పూర్వ విద్యార్థుల సంఘం భావించింది. ఇందులో భాగంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణతో మంగళవారం చర్చించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు మూర్తి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మినరల్ వాటర్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులను మరమ్మతులు చేయించి మరలా ఉపయోగకరం తేవడానికి, మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక గది ఏర్పాటుకు, విద్యార్థుల సైకిల్ స్టాండ్‌కు సహకరిస్తామని చెప్పారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాపిరెడ్డి, కె.కోటేశ్వరరావు, వి.కిషోర్, ఎస్.సంపత్ పాల్గొన్నారు.

రోడ్ల వెంట వద్దు.. ఆ స్థలాల్లోకి వెళ్లండి..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణం పోలేరెడ్డి పాలెం, ఎన్టీఆర్ కాలనీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమిత స్థలాల్లో నివసిస్తున్న వారు జగన్న కాలనీలు, టిడ్కో గృహసముదాయాల్లో ఇళ్లకు వెళ్లాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. ఆయా ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. రోడ్ల పక్క నివాసముంటున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం స్థలాలిచ్చిందని, అయినా ఇక్కడే ఉండడం సరికాదని అన్నారు. ఇళ్ల స్థలం లేదా గృహం మంజూరు కానివారుంటే వారికీ మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్.గోవిందరావు, ఎఇ సిహెచ్. శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్ల వెంట నివాసితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అచ్చంపేట : ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి రైతులు సమాయత్తంలో భాగంగా మండలంలోని చింతపల్లి, తాడువాయి గ్రామాల్లో రైతులతో వ్యవసాయాధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సుగుణ బేగం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని, విత్తనాలు శుద్ధి చేసుకోవాలని చెప్పారు. రైతు భరోసా-పిఎం కిసాన్ పథకాలు, సిసిఆర్‌సి కార్డులకు దరఖాస్తులు గురించి వివరించారు.

క్రమబద్ధీకరణ కోసం ఎమ్మెల్యేకు సిహెచ్‌వోల వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిహెచ్‌వోలుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సిబ్బంది కోరారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. హెల్త్ మిషన్ కింద పని చేస్తున్న తమకు రూ.25 వేల వేతనంతో పాటు రూ.15 వేల ఇన్సెంటివ్ వస్తుందని, అయితే ఇన్సెంటివ్ ఇవ్వడం లేదని చెప్పారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుచున్న తమను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకోళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.



ఆర్‌బికె సేవలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - వెల్దుర్తి : రైతు భరోసా కేంద్రాల్లో అందించే సేవలను రైతులు ఉపయోగించుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ వేసే పంటలను గురించి సలహాలు సూచనలు కోసం వ్యవసాయ అధికారులు కానీ, రైతు భరోసా కేంద్రంలోని సంప్రదించాలని సూచించారు.

వేసవి జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - వెల్దుర్తి : వేసవి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఉప్పలపాడు పిహెచ్‌సి వైద్యులు శ్రీరామ్ సూచించారు. మజ్జిగ, నీరు ఎక్కువగా తాగుతుండాలని, ఎండ తీవ్రతగా ఉండే సమయంలో (మధ్యాహ్నం) అత్యవసరమైతే మినహా బయటకు వెళ్లొద్దని చెప్పారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగును వాడాలన్నారు.

తాగు నీటి కష్టాలు తీరేదెన్నడో..!



పాడైపోయిన బోరు, పైపు లైన్

- బోరు పాడవడంతో గత 15 రోజులుగా తాగునీళ్లు రాక అవస్థలు
- 3 ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తక్షణమే తాగు నీటి సమస్యను పరిష్కరించాలి:సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో పేదలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత 15 రోజులుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ, దిబ్బల ప్రాంతం, చెరువు ఏరియాలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మూడు ప్రాంతాలకు నీరు అందించే బోరు పాడవడంతో స్థానికులకు నీటి సమస్య మొదలైంది. బోరును రిపేరుచేయించకుండా, ప్రజలకు తాగు నీరు అందించకుండా, ఏంటీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామ పంచాయతీల నుండి నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత గ్రామంలో సమస్యలు పట్టించుకునే వారే లేరంటూ గ్రామస్తులు వాపోతున్నారు. అసలే వేసవి కాలం ఒకవైపున ఎండ, ఉక్కపోతలతో అల్లాడుతున్న ప్రజలు తాగడానికి నీళ్లు లేక ప్రైవేటుగా డబ్బులు పెట్టి కొనుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో గ్రామంలోని ప్రధాన పార్టీల నాయకులు సౌజన్యంతో తాగునీటి ట్యాంకర్లతో పేదలకు నీళ్లు అందించేవారు. ఇప్పుడు కనీసం వాటర్ ట్యాంకులతో నీరు కూడా అందక, గ్రామంలోని మూడు ప్రాంతాలలోని పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తక్షణమే తాగు నీటి సమస్యను పరిష్కరించాలి:సిపిఎం

వడ్డేశ్వరంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తలేదని అన్నారు. కానీ తాడేపల్లి మండలంలోని గ్రామాలను మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత విలీన గ్రామాల ప్రజలు స్థానిక సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందులో భాగంగానే తాగునీటి సమస్య ప్రధానంగా గ్రామాల్లో ఉందని, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే వడ్డేశ్వరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. ప్రకటనలో పేర్కొన్నవారిలో సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్యలు అధికారులను కోరారు.



ఆకుకూరలు అందజేస్తున్న వైద్యాధికారి లక్ష్మీసుధా

గర్భిణీలకు ఆకుకూరలు పంపిణీ

ప్రజాశక్తి-కొల్లిపర

మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గర్భిణీళకు రక్తహీనత నివారించుటకు పోషక ఆకుకూరలను దాత చుండూరు భాస్కరరావు, వైద్యాధికారి లక్ష్మీ సుధా పంపిణీ చేశారు. గర్భిణీలలో రక్తహీనత నివారించినట్లయితే ఆరోగ్య వంత మైన బిడ్డకు జన్మ ఇవ్వవచ్చు అని వైద్యాధికారిని లక్ష్మీ సుధా తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణీ లకు ఉచితంగా లేబరేటరీ పరీక్షలు నిర్వహించి మందులు తగు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అందే బాలచంద్రమౌళి, వంగర బుచ్చిబాబు, కోటేశ్వరి ,ఆశీర్వాదమ్మ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి -మంగళగిరి

పట్నంలోని కొత్తపేటకు చెందిన టి.లక్ష్మికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పంపించిన నిత్యావసర సరుకులను మంగళవారం వైసిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, ఏ రాజేష్, ఎస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తాడేపల్లి:విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వెంబడి కొండవీటివాగు ఎత్తిపోతల పథకం వరకు, కెఎల్‌రావు కాలనీ, ఆశ్రమం రోడ్డు, సీతానగరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ సత్యనారాయణ, ఎఇలు ఎన్.నాగమల్లేశ్వరరావు, షణ్ముకరావు ఓ ప్రకటనలో తెలిపారు.

పేదల సమస్యలపై నిరంతరం పోరాడిన ‘ బండారు ’

ప్రజాశక్తి-తాడేపల్లి

పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిరంతరం పని చేసిన బండారు ముత్యాలు ధన్యజీవి అని, ఆయన బాటలో పయనించడమే ఘనమైన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సిపిఎం తాడేపల్లి మాజీ కార్యదర్శి బండారు ముత్యాలు వర్ధంతిని మంగళవారం రాత్రి ప్యారీ కంపెనీ గేటు సమీపంలో గల ఆయన స్మారక స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం కొత్తూరు శాఖ కార్యదర్శి విజయభాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. తొలత నివాళులర్పించి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్యారీ కంపెనీలో ముఠా కార్మికునిగా పని చేస్తూ మేకా అమరారెడ్డితో కలిసి కార్మికుల హక్కుల సాధనకై పాటుపడ్డారని చెప్పారు. పాలేరుల సంఘం పెట్టి వారి జీతాల పెంపుకై కృషి చేశారని కొనియాడారు. తాడేపల్లిలో సిపిఎం అభివృద్ధిని చూసి ఓర్వలేక కొన్ని అరాచక శక్తులు దారి కాసి బండారు ముత్యాలును



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మట్టుబెట్టారని తెలిపారు. సిపిఎం నాయకులపై తాడేపల్లిలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఉన్న సమయంలో కూడా పార్టీని ముందుగా ధైర్యంగా నడిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, కె.మేరి, ఎస్.ముత్యాలరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, వై.బర్నబస్, బి.దశరధరామిరెడ్డి, ఎల్.సత్యం, ఎన్.దుర్గారావు, వై.కోటేశ్వరరావు, సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి వేసవి వినోదం

ప్రజాశక్తి - చేబ్రోలు

వేసవి వినోదం పేరుతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పిల్లలకు మే 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 14 ఏళ్ల పైబడిన విద్యార్థులకు ఉచిత క్యాంప్ నిర్వహిస్తున్నట్లు దండా లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ మండల కార్యదర్శి నాగేశ్వర రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌ను యుటిఎఫ్ మండల కార్యలయం ఉపాధ్యాయన భవనంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రక్కన నిర్వహిచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేసవి వినోదం,విజ్ఞానం కల్పించాలని పలు రకాల క్రాఫ్ట్, మేజిక్, పాటలు, కోలాటం తదితర కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుండి. 10 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను 9490098627 నంబరుకు ఫోన్ చేసి రిజిష్టర్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

12న జాబ్ మేళా

ప్రజాశక్తి - తాడికొండ

జిల్లా ఉపాధి కార్యాలయం నైపుణ్య అబివృద్ధి సంస్థ డి ఆర్‌డిఏ శాఖల ఆధ్వర్యంలో తాడికొండలోని బిఎస్-ఎస్‌బి కళాశాల ఆవరణంలో ఈ నెల 12న నిర్వహించే జాబ్ మేళా నిర్వహిస్తున్నారని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం జాబ్ మేళా బోచర్‌ను స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ కె. రఘు మాట్లాడుతూ 15 కంపెనీలలో 930 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 10 నుండి బీటెక్ వరకు విద్యా అర్హత కలిగిన వారికి రూ.10వేలు నుంచి రూ.40 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. కావున నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి.ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత సమ్మర్ ఇంగ్లీష్ తరగతులు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

పొనుగుపాడులోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థాన కళ్యాణ మండపంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ఇంగ్లీష్ సమ్మర్ క్లాసులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుచే నిర్వహించబడుతున్నాయని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ఎం. వలి తెలిపారు. కోయ వెంకటేశ్వర్లు , నాయకమ్మల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు కోయ రామారావు కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం క్లాసులను నాగార్జున యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరి సీతారామాంజనేయులు ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయని, ఏడవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాల బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ఎం వలి కోరారు.



బసివిరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పౌరాణిక నాటక కళాకారుడు బసివిరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన స్వర్ణమంజరి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు జొన్నల బసివిరెడ్డిని టీడీపీ మహిళా నాయకులు సూరపనేని అనురాధ, శానంశెట్టి ఉమామహేశ్వరి, అప్పిరెడ్డి, కొల్లిపర శ్రీనివాస్, భీమవరపు బసివిరెడ్డి, జొన్నల ఈశ్వరరెడ్డిలు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డి భవాని, ఎస్ సాంబశివరావు, , ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కంకిపాటి శ్రీనివాసరావు, ఎం వెంకట్, ఎన్ శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సభ్యురాలు రాహేలమ్మ కన్నుమూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



మన్నం రాహేలమ్మ

ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన మన్నం రాహేలమ్మ (72) కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు.ఆమెకు ముగ్గురు కుమారులు,ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. రాయలమ్మ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మంగళవారం వడ్డేశ్వరంలోని ఆమె నివాసంలో రాహేళమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య, మాజీ సర్పంచ్ వడ్డేశ్వరం బిక్షాలు, వడ్డేశ్వరం బాబురావు తదితరులున్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి -మంగళగిరి:మంగళగిరిలో శాఖ గ్రంథాలయంకు స్థానిక ఏపీఎస్పీ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన హైకోర్టు ఏజీపీ అప్పల షణ్ముఖరెడ్డి మంగళవారం న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించే పుస్తకాలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు చెందిన 76 పుస్తకాలను ఉచితంగా అందజేశారు. మంగళవారం లైబ్రరీయన్ శ్రీమతి ఆరోగ్యంకు పుస్తకాలను షణ్ముఖరెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయవ్యవస్థపై, చట్టాలపై అవగాహన కలగాలని ఉద్దేశంతో పుస్తకాల అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యే పేద, మధ్యతరగతి నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కూడా అందజేయడం జరిగిందన్నారు. ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఉపయోగించుకొని మంచి విజ్ఞానాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు అందజేయడానికి తమ వంతు కృషి చేస్తానని అన్నారు.

శివరామకృష్ణకు పిహెచ్‌డి ప్రదానం



ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేసిన దొడ్డక శివరామ కృష్ణకు పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి మంగళవారం తెలిపారు. డాక్టర్ ఓ. నాగరాజు పర్యవేక్షణలో హడూప్ ఆర్కిటెక్చర్ పై శివరామ కృష్ణ పరిశోధన చేశారు. మంగళగిరి మండలం కాజా గ్రామానికి చెందిన శివరామకృష్ణ పిహెచ్‌డి పొందడంతో గ్రామస్థులు, యూనివర్సిటీకి చెందిన అధికారులు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు. శివరామకృష్ణ ప్రస్తుతం వర్సిటీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వార్డుల ఆకస్మిక తనిఖీలో సిబ్బందిపై జెసి ఆగ్రహం

ప్రజాశక్తి - నరసరావుపేట

సచివాలయ సిబ్బంది నిబంధనలు, సమయపాలన పాటించకపోవడం పట్ల జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నరసరావుపేట 18, 19 వార్డులను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది ఆలస్యంగా రావడం, డ్రెస్ కోడ్ పాటించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్‌తో పాటు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి, డ్రెస్ కోడ్ పాటించని సిబ్బందికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను తక్షణమే సాయంత్రం లోపల కలెక్టర్ కార్యాలయం తీసుకొని వచ్చి సంబంధిత అధికారులకు చూపించాలని ఆయన ఆదేశించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా జెసి


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

కుసుమకుమారికి ఎమ్మెల్సీ కెఎస్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్ విద్యార్థిని ఎస్. కుసుమ కుమారిని పదో తరగతి ఫలితాల్లో 593 మార్కులు సాధించినందు కుగాను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మంగ ళవారం అభినం దించారు. భవిష్యత్‌లో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా సుమేధా స్కూల్ యాజమా న్యానికి అభినందనలు తెలి పారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ విద్యావేత్త కన్నా మాస్టారు

కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

వాణిజ్య పన్నుల శాఖలో గ్రూప్ వన్ అధికారిగా పనిచేస్తూ విద్యాబోధనపై ఉన్న ఆసక్తితో ఉద్యోగాన్ని ఒదులకొని, గత ఐదు దశాబ్దాలుగా వేలాదిమంది పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దు తున్న డాక్టర్ కన్నా మాస్టర్ ఆదర్శ విద్యావేత్త అని కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ సింగరి సంజీవ కుమార్ పేర్కొన్నారు. ఏఎన్‌యు దూర విద్య కేంద్రం నుండి డాక్టరేట్ పొందిన కన్నా మాస్టర్‌కు కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎంతో మంది పేదలకు ఉచితంగా అతి తక్కువ ఫీజుతో విద్యాబోధన చేస్తున్న కన్నా మాస్టర్ ఒక రోల్ మోడల్ అని కొనియాడారు. సమాజ హితం కోసం విద్యారంగంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కన్నా మాస్టర్ నగర అపుస్మ సంఘ అధ్యక్షులుగా విశేష సేవలు అందించారన్నారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సామాజిక ఉద్యమ నేత వై.కె, హిందూ కాలేజి కరస్పాండెంట్ చెరువు రామకృష్ణ మూర్తి, నూతలపాటి తిరుపతయ్య, కొండా శివరామిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖం ^రావు, ఉర్దూ డిఐ షేక్.ఖాసిం తదితరులు కన్నా మాస్టర్‌ను అభినందించారు.


మాట్లాడుతున్న ఎంపి సంజీవకుమార్

ఆదర్శ నేతలు గౌస్, నాగమల్లేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు



నివాళులర్పిస్తున్న నాయకులు

వ్యక్తిగత అవసరాల కన్నా సంఘ ఆశయాలకు కట్టుబడి, అంకితభావంతో పనిచేసే వారే అసలైన యుటిఎఫ్ కార్యకర్తలని, అటువంటి కోవకు చెందిన వారు గౌస్, నాగమల్లేశ్వరరావు అని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎండి.గౌస్, కె.నాగమల్లేశ్వర రావు ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గౌస్, నాగమల్లేశ్వరరావు తుది శ్వాస విడిచేదాకా సంఘంలో నిబద్ధతతో పనిచేయటం అందరికీ ఆదర్శమన్నారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను కోల్పోవటం బాధాకరమని అన్నారు. సంఘం బలోపేతానికి వారు చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కెఎస్‌వి దుర్గారావు మాట్లాడుతూ గౌస్, నాగమల్లేశ్వరరావు సంఘం నిర్మాణంలో, కార్యకర్తల తయారీలో దిట్ట అని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు జి.ప్రభుదాసు మాట్లాడుతూ కొత్తతరం అమరుల స్ఫూర్తిని అందుకొని సంఘంలో పనిచేయాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కోశాధికారి ఎన్.తాండవకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి సమస్యలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలపై స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, జిల్లా కోశాధికారి ఎండి.గయాసుద్దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, షకీలాబేగం, వెంకటేశ్వరరావు, టి.ఆంజనేయులు, కె.శ్రీదేవి, ఎ.శ్రీనివాసరావు, ఎం.గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రక్తహీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సుఖప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై వైద్యారోగ్య శాఖ, విద్యా, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి నెలా నిర్దేశించిన విధంగా బీపీ, షుగర్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవల ఫీడ్ బ్యాక్ ఏఎన్ఎంలు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖలో ఖాళీగా వున్న పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, స్టాఫ్ నర్సుల పోస్టుల నియమాకాలను బుధవారం నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. గర్భిణీలకు ప్రతి నెల రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనత వున్న వారికి బర్త్ ప్లానింగ్, సమీపంలోని జిల్లా ఆసుపత్రికి ట్యాగింగ్, రవాణా సక్రమంగా నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీరికి ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలల్లో సంపూర్ణ పోషణ తీసుకునేలా సీడీపీఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మన బడి నాడు-నేడు ద్వారా మంజూరు చేసిన పాఠశాలల మరమ్మతు, అభివృద్ధి పనులు నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా విద్యాశాఖాధి.కారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8, 9,10 తరగతులు పూర్తి చేసిన వారు తదుపరి విద్యా సంవత్సరంలో పైతరగతులలో జాయిన్ అయ్యేలా ఇప్పటి నుండే విద్యాశాఖాధికారులు ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సిఈఓ మోహన్‌రావు, డియం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, ఐసీడీఎస్ పీ.డీ మనోరంజని, డిఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏ.పి.సి విజయలక్ష్మి, డిపిఎంఓ చుక్కా రత్నమన్మోహన్, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కంటి పరీక్షలను జూన్ నాటికి పూర్తి చేయాలి

జిల్లాలో వైఎస్సార్ కంటి వెలుగు మూడవ విడతలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు కంటి పరీక్షలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి జిల్లాలో జరుగుతున్న వైఎస్సార్ కంటి వెలుగు మూడవ విడత కంటి పరీక్షలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా జిల్లాలో 60 శాతం మంది వృద్ధులకు ప్రాథమికంగా కంటి పరీక్షలు పూర్తి చేయటం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు జూన్ నాటికి నూరు శాతం కంటి పరీక్షలు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలోని ఎఎన్‌ఎంలను సమన్వయం చేసుకుంటూ వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పరీక్షలలో లోపాలు గుర్తించిన వారికి కంటి అద్దాల పంపిణీ, క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఆప్తమాలిక్ మెడికల్ ఆఫీసర్లు కంటి పరీక్షల నిర్వహణలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి వైద్యాధికారులను సమన్వం చేసుకొని వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రావణబాబు, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణ, ఆప్తమాలిక్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో వాగ్దేవి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట :బహుళజాతి సంస్థల్లో తమ కళాశాల విద్యార్థులు 26 మంది రూ.2.20లక్షలు వార్షిక వేతనంతో కొలువులు సాధించారని రావిపాడు రోడ్డులోని వాగ్ధేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల గురించి ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కళాశాలలో ఐటి రంగంలో బహుళ జాతి కంపెనీ స్కిల్ క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధులు డిగ్రీ ఆఖరు సంవత్సర విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించాం ^న్నారు. ముఖాముఖీ, బృంద చర్చలు,హెచ్‌ఆర్ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించా రన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణ అనంతరం రూ 2.20 లక్షలు వార్షిక వేతనం చెల్లించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు ఆహిల్, మహేష్ తెలిపారు. తమ విద్యార్థులు 26 మంది ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు సాదించడం పట్ల తమకు గర్వంగా ఉందని కళాశాల సెక్రటరీ అండ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు అయిపోయిన వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారని పేర్కొన్నారు. డిగ్రీ మొదటి ఏడాది నుండి వృత్తి విద్యా కోర్సులలో ఇస్తున్న ప్రత్యేక శిక్షణతో తమ విద్యార్థులు ఎంతో మంది బహుళజాతి కంపెనీలలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వర రావు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఎస్. సురేష్ బాబు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, తదితరులు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు